# నిధుల వేటలో ఎల్‌ఆర్‌ఎస్ బాట

- మార్చి నెలాఖరుకు పూర్తి కావాలని ప్రభుత్వ పెద్దల ఒత్తిడి
- ముక్కుపిండి మరీ వసూలు చేయాలని ఆదేశాలు
- అసాధ్యమంటున్న కమిషనర్లు
- ప్రజల నుంచి కరువైన స్పందన
- ఉచితంగా చేస్తామన్న హామీని గుర్తుచేస్తున్న దరఖాస్తుదారులు

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం నిధుల వేటలో భాగంగా ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టిపెట్టింది. ప్రజల నుంచి ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేసి ఖజానా నింపాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఇందుకోసం మున్సిపల్ కమిషనర్లపై ఒత్తిడి పెంచింది. ఎట్టి పరిస్థితుల్లో మార్చి నెలాఖరు నాటికి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. అభివృద్ధి పనులు సైతం పక్కనపెట్టి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయడంపై దృష్టిపెట్టాలని స్పష్టం చేశారని సమాచారం. ఈ మేరకు రోజూ సాయంత్రం నివేదికలు అందించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సీడీఎంఏ) నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిసింది. ప్రత్యేక సిబ్బందిని నియమించారని, వారు రోజూ మున్సిపల్ కమిషనర్లకు ఫోన్లు చేసి ఫాలో అప్ చేస్తున్నారని సమాచారం. అనుకున్న మేరకు లక్ష్యం పూర్తి చేయాలని తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్తున్నారు. రాష్ట్రంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దాదాపు 25 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 1.06 లక్షలు, హెచ్‌ఎండీఏలో 3.58 లక్షలు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో 1.35 లక్షలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 13.68 లక్షలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీల పరిధిలో 6 లక్షల వరకు దరఖాస్తులు ఉన్నట్టు చెప్తున్నారు.

### తలలు పట్టుకుంటున్న కమిషనర్లు

ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్లు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు, ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, వాటి వెరిఫికేషన్, కులగణన, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, రేషన్‌కార్డుల సర్వే.. ఇలా మున్సిపల్ సిబ్బంది పని ఒత్తిడితో సతమతమవుతున్నారని వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతున్నదని అంటున్నారు. ఇలాంటి సమయంలో గడువులోగా ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేయడం అసాధ్యమని వాపోతున్నారు. చేసేదేమీ లేక ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఎస్‌ఎంఎస్‌ల ద్వారా సమాచారం పంపిస్తున్నారు. ఫోన్లు చేసి దరఖాస్తులు క్లియర్ చేసుకోవాలని కోరుతున్నారు. అయినా పెద్దగా స్పందన లేదని వాపోతున్నారు. కొందరు సహకరిస్తుండగా, మరికొందరు 'ఉచితమని ప్రభుత్వం హామీ ఇచ్చింది కదా? ఫీజు ఎందుకు చెల్లించాలి?' అని ప్రశ్నిస్తున్నారని చెప్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తున్నారు.

# బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ ఊసేది?

- 11 సంవత్సరాలు గడిచినా నెరవేరని విభజన హామీ
- కేంద్రంపై నోరు మెదపని రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్
- రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలున్నా ఫలితం సున్నా
- తెలంగాణకు తీరని అన్యాయం



హైదరాబాద్, జనవరి 19(నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి భారీ ప్యాకేజీని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరచిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీని మాత్రం విస్మరించింది. గతంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని విక్రయించేందుకు సిద్ధపడిన మోదీ ప్రభుత్వం.. ఇప్పుడు రూ.30 వేల కోట్లకుపైగా ప్యాకేజీ ఇచ్చేందుకు సిద్ధమైంది. మొదటి విడతలో రూ.11 వేల కోట్ల పైచిలుకు ప్యాకేజీని ప్రకటించింది. అదే సమయంలో బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అన్ని అవకాశాలున్నప్పటికీ, కేంద్రం ఆ దిశగా ఆలోచించకపోవడం తెలంగాణపై ప్రదర్శిస్తున్న వివక్షకు అద్దం పడుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం కానీ, రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు కానీ, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కానీ నోరుమెదపకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

### బయ్యారంలో ఐరన్‌ఓర్ నిల్వలు

బయ్యారం ప్రాంతంలో 1.41 లక్షల ఎకరాల విస్తీర్ణంలో భారీగా ఐరన్‌ఓర్ నిల్వలు ఉన్నట్టు గతంలో గుర్తించారు. బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు ద్వారా తక్కువ ధరకే ఇనుము ఉత్పత్తి కావడంతోపాటు స్థానికంగా వేలాదిమందికి ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉన్నది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశాన్ని పొందుపర్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాదాపు 11 ఏండ్లుగా ఈ విషయాన్ని నాన్చుతున్నది. దీనిపై కేసీఆర్ ప్రభుత్వం అనేకసార్లు కేంద్రానికి లేఖలు రాసినా, ప్రధానిని కలిసినా ఫలితం లేదు. బయ్యారంలో సమృద్ధిగా ఐరన్‌ఓర్ నిల్వలున్నా, నాణ్యతలేదని బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ సాధ్యంకాదని కేంద్రం చెప్తున్నది. విశాఖ ఉక్కుకు ఇనుప గనులే లేవు. 600 కిలోమీటర్ల దూరంలోని ఛత్తీస్‌గఢ్‌లోని బైలాడిల్లా నుంచి ఐరన్‌ఓర్‌ను సరఫరా చేస్తున్నారు. బయ్యారం నుంచి బైలాడిల్లా కేవలం 160 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. ఛత్తీస్‌గఢ్ నుంచి 100 మిలియన్ టన్నుల ఐరన్‌ఓర్‌ను రాష్ట్రానికి కేటాయించి బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవచ్చని బీఆర్‌ఎస్ సర్కారు అనేకసార్లు కేంద్రానికి విన్నవించింది. బయ్యారం, లేక దాని పరిసర ప్రాంతాల్లో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటునకు ఎన్‌ఎండీసీ గతంలో ముందుకొచ్చింది. మరోవైపు బయ్యారానికి ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి కూడా ఐరన్‌ఓర్‌ను సరఫరా చేసే వీలున్నది. రవాణా ఖర్చులు తగ్గి తక్కువ ధరకే స్టీల్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నది. స్థానికంగా ఉన్న ఐరన్‌ఓర్‌ను ఉపయోగించుకునే అవకాశం కలుగుతుంది.

### బయ్యారానికే ఎక్కువ అనుకూలతలు

విశాఖపట్టణంతో పోల్చుకుంటే బయ్యారానికి అనేక అనుకూలతలు ఉన్నప్పటికీ, కేంద్రం మాత్రం బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటునకు సుముఖంగా లేదు. స్టీల్ ఫ్యాక్టరీ కోసం బీఆర్‌ఎస్ సర్కారు పదేండ్లపాటు నిర్విరామంగా పోరాడింది. అయినా తెలంగాణ పట్ల మొదటినుంచీ వివక్షాపూరిత వైఖరిని అవలంబిస్తున్న బీజేపీ సర్కారు మనసు కరగలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు.. అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఇంతవరకు బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ అంశాన్ని కేంద్రం వద్ద ప్రస్తావించకపోవడం గమనార్హం. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు హయాంలో ఆమోదం పొందిన విభజన బిల్లును అమలు చేయించేందుకు ఆ పార్టీ కేంద్ర నాయకత్వం కూడా ఎటువంటి ప్రయత్నాలూ చేయడంలేదు. రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎనిమిది మంది బీజేపీ ఎంపీ లు, వీరిలో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ బయ్యారం స్టీల్ గురించి నోరు మెదపడం లేదు. నష్టాల్లో కూరుకుపోయి విక్రయించేందుకు సిద్ధమైన విశాఖకు భారీ ప్యాకేజీ ప్రకటించిన ప్రస్తుత సందర్భంలో బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ అంశాన్ని కేంద్రానికి గుర్తుచేయడం సర్కారుతోపాటు బీజేపీ ఎంపీల బాధ్యత.

### విశాఖ ఉక్కుకు జీవం పోసింది కేసీఆరే

గతంలో నష్టాల పేరుతో విశాఖ ఉక్కు ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలన్న కేంద్ర నిర్ణయాన్ని అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికులు చేపట్టిన ఉద్యమానికి బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని కేంద్రం భావిస్తే, దానిని కొనుగోలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమని ప్రకటించడమే కాకుండా, బిడ్డింగ్‌లో పాల్గొనే అంశాలను పరిశీలించాలని సింగరేణి అధికారులను విశాఖకు పంపారు. అయితే, అప్పట్లో ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కానీ, విపక్షంలో ఉన్న టీడీపీ నాయకులు కానీ కేంద్ర వైఖరిపై మౌనం వహించారు. బీఆర్‌ఎస్ పోరాటంతో చివరికి ప్రైవేటీకరణ యత్నాల నుంచి కేంద్రం వెనక్కు తగ్గింది. దీంతో విశాఖ ఉక్కు కార్మికులు కేసీఆర్‌ను ఎంతగానో కొనియాడారు. కేసీఆర్ రంగంలోకి దిగడంతోనే కేంద్రం వెనక్కు తగ్గిందని, లేకుంటే అప్పుడే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరిగేదని రాజకీయ వర్గాలతోపాటు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులు చెప్తున్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు బీఆర్‌ఎస్ ఎంతగా పోరాడుతున్నదో, అంతే స్థాయిలో విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా కూడా పోరాడింది.

## ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

మెట్‌పల్లి, జనవరి 19: మార్టిగేజ్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ అసిఫోద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. అదే కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ బాల్‌సింగ్‌కు సబ్ రిజిస్ట్రార్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఐడీ లాక్ చేయడంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ క్రమంలో జూనియర్ అసిస్టెంట్‌కు బదులుగా ఆ శాఖ కరీంనగర్ డీఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్ భాస్కర్‌ను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## సూపర్ స్పెషాలిటీలో నిలిచిన శస్త్రచికిత్సలు

వరంగల్ చౌరస్తా, జనవరి 19 : ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో విఫలమవుతున్నది. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల సూపర్ స్పెషాలిటీ దవాఖానలో వైద్య సేవలకు వసతులలేమి ముప్పుగా మారింది. నిరాటంకంగా కొనసాగాల్సిన శస్త్రచికిత్సలు యంత్ర పరికరాలు, వైద్య నిపుణుల కొరత కారణంగా నిలిచిపోయాయి. పది రకాల సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ఏర్పాటు చేసిన దవాఖానలో పలు సర్జరీలు కొనసాగక రోగులు ఇబ్బందిపడుతున్నారు.

చిత్రం



## ఏకకాలంలో తొమ్మిది సినిమాలు!

'సినీరంగంలో 52 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది. వృత్తిపట్ల అంకితభావం, క్రమశిక్షణ వల్లే ఇది సాధ్యమైంది. ఆఖరిశ్వాస వరకు షూటింగ్‌లోనే ఉండాలని కోరుకుంటున్నా' అన్నారు సీనియర్ నటుడు వీకే నరేష్. నేడు ఆయన జన్మదినం. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ '2025 నా కెరీర్‌లో బిజీయెస్ట్ ఇయర్ కాబోతున్నది. తొమ్మిది సినిమాలు ఏకకాలంగా షూటింగ్‌లో ఉన్నాయి. ఇందులో రెండు చిత్రాల్లో లీడ్ రోల్స్ చేస్తున్నా' అన్నారు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల గురించి చెబుతూ 'శర్వానంద్‌తో ఓ సినిమా చేస్తున్నా. నారా రోహిత్ 'సుందరకాండ', ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో 'సారంగపాణి జాతకం', మారుతి రైటింగ్స్'బ్యూటీ' సినిమాలతోపాటు రవితేజతో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్నా. అన్నింటిలో విభిన్న పాత్రల్లో కనిపిస్తా. మా అమ్మ విజయనిర్మల బయోపిక్ చేయాలనే కల ఉంది. అలాగే చిత్రం భళారే విచిత్రం, శ్రీవారికి ప్రేమలేఖ చిత్రాలకు సీక్వెల్ కూడా చేయాలనుకుంటున్నా' అని అన్నారు.

### పద్మ అవార్డు కోసం ప్రయత్నం ఫలించలేదు

తన తల్లి విజయనిర్మలకు పద్మ అవార్డు కోసం ఢిల్లీ వరకూ వెళ్లినా ఫలితం దక్కలేదని నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. '46 చిత్రాలను తీసిన ఏకైక మహిళా దర్శకురాలిగా మా అమ్మ రికార్డు సృష్టించారు. కేసీఆర్‌గారు ఆయన హయాంలో ఆమెకు పద్మ అవార్డు కోసం సిఫార్సు చేశారు. కానీ ఫలితం రాలేదు. విజయనిర్మలగారికే కాదు. చాలా మంది గొప్ప వ్యక్తులకు అవార్డులు రావడం లేదు. మరోసారి అవార్డు కోసం ప్రయత్నిస్తా' అని నరేష్ పేర్కొన్నారు.



## ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ 'ప్రేమంటే'

ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న 'ప్రేమంటే' చిత్రం శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సినిమా ద్వారా నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రముఖ యాంకర్ సుమ కీలక పాత్రను పోషిస్తున్నది. శ్రీవెంకటేశ్వర సినిమాస్ పతాకంపై జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌పై 'థ్రిల్లు ప్రాప్తిరస్తు' అనే ట్యాగ్‌లైన్ ఆసక్తిని పెంచుతున్నది. ముహూర్తపు సన్నివేశానికి హీరో రానా క్లాప్‌నివ్వగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కెమెరా స్విఛాన్ చేశారు. 'ఆహ్లాదభరితమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుంది. ప్రియదర్శి పాత్ర వైవిధ్యంగా ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి, సంగీతం: లియోన్ జేమ్స్, రచన-దర్శకత్వం: నవనీత్ శ్రీరామ్.

## కోపంగా చూడకే కొట్టినట్టు..



యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రూబా'. విశ్వకరుణ్ దర్శకుడు. శివమ్ సెల్యూలాయిడ్స్, సారెగమ మ్యూజిక్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టారు. 'అగ్గిపుల్లె..' అనే తొలి గీతాన్ని ఇటీవల విడుదల చేశారు. 'అగ్గిపుల్లె అలా గీసినట్టు, కోపంగా చూడకే కొట్టినట్టు, గాలి దుమారమే రేగినట్టు..' అంటూ చక్కటి మెలోడీతో ఈ పాట సాగింది. సామ్ సీఎస్ ఈ గీతానికి స్వరాల్ని అందించారు. లవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, 'క' తర్వాత కిరణ్ అబ్బవరం నుంచి వస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలేర్పడ్డాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, ప్రొడక్షన్ డిజైనర్: సుధీర్, నిర్మాతలు: రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ, రచన-దర్శకత్వం: విశ్వకరుణ్.

## వరుణ్‌తేజ్ హారర్ కామెడీ చిత్రం



యువ హీరో వరుణ్‌తేజ్ కొత్త చిత్రాన్ని ప్రకటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మించబోతున్న ఈ సినిమాకు మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తారు. ఆదివారం వరుణ్‌తేజ్ పుట్టిన రోజు సందర్భంగా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫైర్ డ్రాగన్ లోగోతో, అక్షరాలతో పోస్టర్ ఆసక్తి నిరేకెత్తించేలా ఉంది. 'వెన్ హంటింగ్ టర్న్స్ హిలారియస్' అనే ట్యాగ్‌లైన్ కథాంశం గురించి తెలియజేస్తున్నది. ఇండో-కొరియన్ హారర్ కామెడీ జోనర్‌లో అడ్వెంచరస్ కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. మార్చిలో సెట్స్‌మీదకు వెళ్లనున్న ఈ సినిమాకు తమన్ సంగీతాన్నందించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తారు.

## జాబిలమ్మ నీకు అంత కోపమా



తమిళంలో విలక్షణ కథానాయకుడిగా గుర్తింపును తెచ్చుకున్నారు ధనుష్. మరోవైపు దర్శకుడిగా కూడా ఆయన చక్కటి ప్రతిభ కనబరుస్తుంటారు. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన పాండి, రాయన్ చిత్రాలు భారీ విజయాల్ని సాధించాయి. తాజాగా ఆయన దర్శకత్వం వహిస్తున్న తమిళ చిత్రాన్ని 'జాబిలమ్మ నీకు అంత కోపమా..' పేరుతో తెలుగులో విడుదల చేయబోతున్నారు. రొమాంటిక్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన ఈ సినిమా ఫిబ్రవరి 21న విడుదలకానుంది. పవీష్, అనిఖ సురేంద్రన్, ప్రియా ప్రకాష్ వారియర్, మాథ్యూ థామస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్నందిస్తున్నారు.









Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.